సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 10-1-2025

సంపుటి: 20 సంచిక: 245

పేజీలు: 4 వెల: రూ.1

## టీడీపీ అధ్యక్షుడి నోట.. అడ్డుగోలు మాట



**ఆకులతంపరలో ఆందోళన చేసిన కలమట**

**నివగాం ఊసెత్తని రమణ**

**పరిశీలనకు వెళ్లిన మైన్స్ అధికారులు**

(సత్యంన్యూస్, కొత్తూరు)

జిల్లాలో ఇసుక తవ్వకాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయని చెప్పడానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ పాతపట్నం



నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద ఇసుక తవ్వకాలను అడ్డుకుంటూ హడావుడి చేయడమే నిదర్శనం. ఆకులతంపర ఇసుక ర్యాంపు వద్ద కలమట వెంటరమణ ఆందోళన చేయడం ఇది రెండోసారి. ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చిన ఆగస్టులో ర్యాంపుల నుంచి ఇసుకను తరలిస్తున్న లారీలను అడ్డుకొన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అక్రమ ఇసుక తవ్వకాలు జరిపి పార్టీ ప్రతిష్టను దిగజార్చినట్టు పరోక్షంగా ఆరోపించారు. ఆ తర్వాత గమ్మున ఉండిపోయారు. సుమారు 5 నెలల తర్వాత ఆకులతంపర వద్ద అక్రమాలు జరుగుతున్నాయంటూ రోడ్డెక్కారు. వాస్తవంగా కలమట వెంకటరమణ నివాసానికి కిలోమీటరు దూరంలో నివగాంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కలమట సైట్ మీదుగానే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. నివగాం వద్ద ఇసుక రీచ్‌ను మాతల వంతెనకు సుమారు 500 మీటర్ల దూరంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇసుక రీచ్‌ను ప్రతి 14 రోజులకు ఒకసారి రెన్యువల్ చేస్తూ గత ఆరు నెలలుగా ఇసుకను రేయింబవళ్లు తవ్వుతున్నారు. ఇక్కడ ఇసుక తవ్వకాలను విశాఖ, తునికి - మిగతా 4లో

## కలెక్టర్ పిలిచారా? లైట్‌తీస్కో



- రెవెన్యూలో పోని పాత వాసనలు
- ఉదయం ప్రారంభం కావాల్సిన సమీక్ష వాయిదా
- సమగ్ర సమాచారంతో రాని అధికారులు
- ఆగ్రహం వెలిబుచ్చిన కలెక్టర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం డివిజనల్ రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అలక బూనిన వైనం గురువారం చోటుచేసుకుంది. ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి కలెక్టర్, జేసీ హాజరైనా రెవెన్యూ అధికారులెవరూ హాజరు కాలేదు. దీంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ మధ్యాహ్నం 2 గంటలకు వస్తానని, డివిజన్‌లో రెవెన్యూ అధికారులంతా హాజరైన తర్వాత మాత్రమే సమీక్ష నిర్వహిస్తానని వెళ్లిపోయారు. కలెక్టర్ వెళ్లిన గంట తర్వాత జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వెళ్లిపోయారు. గడిచిన ఐదేళ్లలో ఇటువంటి సమావేశాలు లేకపోవడం, ఉన్నా తూతూమంత్రంగా జరగడంతో రెవెన్యూ అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించలేదు. కానీ పై నుంచి రెవెన్యూ క్లియరెన్స్‌ల కోసం కలెక్టర్ల మీద తీవ్ర ఒత్తిడి ఉంది. ఆమధ్య జరిగిన కేబినెట్ మీటింగ్‌లో కూడా రెవెన్యూ సదస్సులపైనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విచారం వ్యక్తం చేశారు. దీనికి తోడు గత ప్రభుత్వ హయాంలో జరిగిన సర్వేలో లోపాలున్నాయన్న ఫిర్యాదులతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. దీంట్లో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎన్నింటి పరిష్కరించారు? కలెక్టర్, జేసీల పరిధిలో తీసుకోవాల్సిన నిర్ణయాలేమిటి? అన్నది చీఫ్ సెక్రటరీకి తెలియపర్చాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సమీక్ష కోసం పిలుపునిస్తే దాన్ని లైట్‌గా తీసుకోవడం కలెక్టర్‌కు రుచించలేదు.

గురువారం ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహిస్తున్నట్టు బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి సమాచారం చేరవేశారు. బుధవారం విశాఖలో ప్రధాని మోడీ సమావేశానికి జన సమీకరణకు డివిజన్‌లోని వీఆర్వోలకే బాధ్యతలు అప్పగించారు. ఒక్కో వీఆర్వోకు వారి పరిధిలో ఒక బస్సును అప్పగించి అందులో మహిళలను మోడీ సభకు తరలించి తిరిగి ఇంటికి తీసుకువచ్చే వరకు వీఆర్వోలకే బాధ్యతలను అప్పగించారు. మోడీ విశాఖ సభ పూర్తయిన తర్వాత బస్సుల్లో తరలివెళ్లిన వారిని ఇంటికి తీసుకురావడానికి అర్ధరాత్రి 12 గంటలు దాటింది. వీరిని ఆయా మండల రెవెన్యూ అధికారులు మోనటరింగ్ చేసే బాధ్యతను ఉన్నతాధికారులు అప్పగించారు. దీంతో వీఆర్వోలు - మిగతా 4లో

## ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్లు అరెస్ట్

- నిందితులపై కేడీ షీట్లు
- ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇద్దరు అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4.90 లక్షల విలువ గల ఏడున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చైన్‌స్నాచింగ్ కేసులో ఒడిశాలోని బరంపురానికి చెందిన సుజిత్ కుమార్ పాడి, బాలకృష్ణ సాహు పట్టుబడినట్టు తెలిపారు. నిందితులను విచారించగా, సదరు నిందితులకు కొత్తూరు, మందస, ఎచ్చెర్ల, కోటబొమ్మాళి పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరం చేసినట్టు గుర్తించినట్టు తెలిపారు. వీరిద్దరూ అనేక కేసుల్లో శిక్షలు పడడం, జిల్లాలో జరిగిన చోరీ కేసుల్లో నిందితులుగా ఉండడం వల్ల వీరిపై కేడీ షీటు తెరవ



నున్నట్టు తెలిపారు. నిందితుడు సుజిత్ కుమార్ పాడి పదో తరగతి వరకు చదివి మానేశాడని, భార్య, పిల్లలతో కలిసి ఆయన్ను విడిచి వెళ్లిపోయిందన్నారు. బరంపురం గొడవల్లో అరెస్టయి జైలులో ఉండగా బాలకృష్ణ సాహుతో పాడికి జైలులోనే పరిచయమైందని, ఇద్దరూ ఒడిశాలోని బరంపురం, పర్లాకిమిడి, కాశీనగర్, గురండి తదితర ఏరియాల్లో ఒంటరి మహిళలే టార్గెట్‌గా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతూ వచ్చారని తెలిపారు. కొన్నాళ్లు అరెస్టయి జైల్లో ఉన్నారని తెలిపారు. 2016 నుంచి 2024 వరకు జిల్లాలో మొత్తం 32 కేసులు నమోదయ్యాయని, అందులో కంచిలి, మందస, బారువ, నందిగాం కేసుల్లో శిక్ష పడిందన్నారు. కోటబొమ్మాళి పీఎస్ కేసులో జైలు నుంచి విడుదలైన అనంతరం 6 నెలలు పర్లాకిమిడి జైలులో ఉన్నారన్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత కొత్తూరు, మందస, ఎచ్చెర్ల, కోటబొమ్మాళి కేసుల్లో నేరాలు చేసినట్టు తెలిపారు. గురువారం సాయంత్రం మెట్టూరు జంక్షన్ వద్ద కొత్తూరు పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా మోటార్ సైకిల్‌తో పట్టుబడినట్టు తెలిపారు. ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడంలో క్రియాశీలకంగా సందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, కొత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చింతాడ ప్రసాద్, కొత్తూరు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ అమీర్ అలీ, కానిస్టేబుల్ శివప్రసాద్, పి.ప్రసన్న కుమార్, ఎస్.సంపత్‌కుమార్, హోంగార్డ్ సాంత్రో సంతోష్ కుమార్ పాల్గొన్నారు.




## కోట్లమందిలో కొందరి దగ్గరే 18 శాతం సంపద!

**ఇదీ భారత్ ఆర్థికస్థితి**




- రమణ కొంటికర్ల


**ఆర్థిక అసమానతలు తగ్గాలనే ఊకదంపుడు ఉపన్యాసాలెలాగూ ఉండనే ఉంటాయి. కానీ, అది తగ్గేదిలేకపోగా భారతదేశంలో ఆర్థిక తారతమ్యాలు మాత్రం అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ఒకసారి ధనవంతుల జాబితా చూస్తే దిమ్మతిరిగిపోతుంది. అంతేకాదు భారత్‌లో 18 శాతం సంపదంతా కేవలం 2వేల కుటుంబాలు మాత్రమే నియంత్రిస్తున్నాయంటే మీరు నమ్మగలరా..? కానీ, అదే నిజం.**

ఈ విషయాన్ని ఇటీవలే బాంబే షేవింగ్ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో శంతన్ దేశ్ పాండే లింక్డ్ ఇన్‌పోస్ట్‌లో పేర్కొన్నారు. తద్వారా భారతదేశ ఆర్థిక నిర్మాణంలో ఉన్న అసమానతలను సమాజం దృష్టికి తీసుకొచ్చే యత్నం చేశారాయన. 18 శాతం సంపదంతా చేతుల్లో పెట్టుకున్న ఆ 2వేల కుటుంబాలు కూడా పన్నుల రూపంలో చెల్లిస్తున్న వాటా కేవలం 1.8 శాతమేనని, ఇదొక మతి పోగొట్టే విషయంగా ఆయన అభివర్ణించారు.

భారత్‌లో ఒక పది సంపన్న కుటుంబాలు విస్తరించిన వ్యాపార సామ్రాజ్యాలు చూస్తే ఔరా అనిపించేవి. వారు దేశ ఆర్థికవృద్ధికి కారకులా, లేక పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు ప్రతీకలా అన్నదీ ఓ పెద్ద చర్చే. ఎందుకంటే టెక్నాలజీ, ఇంధనం, ఔషధాలు, వినియోగ వస్తువులు ఇలాంటి పరిశ్రమలను నిర్వహించేవారే భారత్‌లోని టాప్ టెన్ జాబితాలో కనిపిస్తున్నవారున్నారు. వారి వల్ల ఉపాధి కల్పన జరగడంతో పాటు, ఉత్పాదకతలోనూ, ఆర్థికంగానూ భారత్ ఎదగడంలో ఆయా వ్యాపారవేత్తల పాత్ర కీలకం. అంతేకాదు.. ప్రపంచ వ్యాపార వేదికపై భారత్‌కు స్థానం కల్పించడంలోనూ, బహుళజాతి కంపెనీలతో భాగస్వామ్యాలను నడపడంలోనూ, అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఆవిష్కరణల్లోనూ వారి భాగస్వామ్యం, వారందించే సంపద నిస్సందేహంగా భారత్‌కు బాసటే. అలాంటి కుటుంబాల్లో మనం కొన్ని గమనిస్తే ముఖేష్ అంబానీ గ్రూప్, అదానీ గ్రూప్ నంబర్ వన్, టూ పొజిషన్స్‌లో కనిపిస్తుంటే.. బిర్లాలు, నాడార్లు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంబానీ రిలయన్స్ ఇండస్ట్రీస్ సామ్రాజ్యం 95.4 బిలియన్ డాలర్స్ నికర విలువతో దేశ ఆర్థికరంగంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఇక ఆ తర్వాతి స్థానంలో అదానీ గ్రూప్‌దే పైచేయి. ఇంధనం, మౌలిక సదుపాయల కల్పనలో ఈ రెండు గ్రూప్స్ ఇంక ఏ పారిశ్రామికవేత్తలకు అందనంత ఎత్తులో ఉన్నాయి. ఆ తర్వాత భారతదేశ పారిశ్రామికాభివృద్ధిలో బిర్లాలు, నాడారా పాత్ర దశాబ్దాల కాలం నుంచీ కొనసాగుతోంది.

**2025లో ఫోర్బ్స్ జాబితాలో స్థానం సంపాదించిన 10 మంది భారతీయ పారిశ్రామికవేత్తల జాబితా**

**ముఖేష్ అంబానీ**

రిలయన్స్ ఇండస్ట్రీస్
95.4 మిలియన్ డాలర్స్
67 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 18వ స్థానం


**గౌతమ్ అదానీ**

అదానీ గ్రూప్
62.3 బిలియన్ డాలర్స్
62 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 25వ స్థానం


**శివ్ నాడార్**

హెచ్సీఎల్
42.1 బిలియన్ డాలర్స్
79 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 37వ స్థానం

**సావిత్రి జిందాల్ అండ్ ఫ్యామిలీ**


ఓ.పీ. జిందాల్ గ్రూప్
38.5 బిలియన్ డాలర్స్
74 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 41వ స్థానం

**దిలీప్ షాంఘ్వీ**

సన్ ఫార్మాస్యూటికల్స్ ఇండస్ట్రీస్
29.8 బిలియన్ డాలర్స్
69 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 59వ స్థానం

**సైరస్ పూనావాలా**

సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా
22.2 బిలియన్ డాలర్స్
83 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 89వ స్థానం

**కుమార మంగళం బిర్లా**

ఆదిత్య బిర్లా గ్రూప్
21.4 బిలియన్ డాలర్స్
57 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 92వ స్థానం

**కుశాల్ పాల్ సింగ్**

డీఎల్ఎఫ్ లిమిటెడ్
18.1 బిలియన్ డాలర్స్
93 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 106వ స్థానం

**రవి జైపురియా**

వరుణ్ బేవరేజెస్
17.9 బిలియన్ డాలర్స్
70 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 108వ స్థానం

**రాధాకిషన్ దమాని**

డీమార్ట్
15.8 బిలియన్ డాలర్స్
70 ఏళ్ల వయస్సు
వరల్డ్ ర్యాంక్ 129వ స్థానం

• ఎడిటోరియల్

# మతం ఎప్పుడూ ఇదే చేస్తుంది

పుష్కరాల్లో 29 మందిని చంపేస్తుంది. యాత్ర కోసం వెళ్లిన 2వేల మంది ముస్లింల ప్రాణాలు తీస్తుంది. బాప్టిజం పేరిట చిన్నబిడ్డను నీళ్లల్లో ముంచి చంపేస్తుంది. ఇప్పుడు తిరుపతిలో ఆరుగురి ప్రాణాలు తీసింది. మతం ఇంకా ఘోరమైన విషయాలు చేయిస్తుంది. 'ఇద్దరు బిడ్డల్నేసుకుని బెనిఫిట్ షోకి రాకపోతే ఏమి?' అని చచ్చిపోయిన రేవతి మీద దుమ్మెతిపోసిన ఆ జనమే, ఇప్పుడు మరణించిన ఈ ఆరుగురినీ చూసి 'ఆహా.. ఎంత అదృష్టం! వారు తప్పకుండా వైకుంఠం చేరుకుంటారు' అని అనేలా చేస్తుంది. ఇంకా గట్టిగా మాట్లాడితే, 'అంతా వారి పూర్వజన్మ రాత. అప్పుడేవో పాపాలు చేసినందుకే ఇప్పుడిలా జరిగింది' అని కూడా అనిపిస్తుంది. జాగ్రత్తగా గమనించండి. ఆ క్యూలైన్లలో ఒక్క సినిమా హీరో, హీరోయిన్, వ్యాపారవేత్త, రాజకీయనాయకుడు ఉండరు. ఏం? వాళ్లకు పుణ్యం వద్దా? వాళ్లను శ్రీనివాసుడు కరుణించొద్దా? మతం ఎప్పటికీ మత్తుమందే! విజయవాడ హైందవ శంఖారావానికి డబ్బున్న వ్యాపారవేత్తలు, సినిమా హీరోలు, పారిశ్రామికవేత్తలు ఎందుకు రాలేదో అర్థమైందా ఇప్పటికైనా? మతం కోసం గొంతు చించుకోవాల్సిందీ మనమే, ఆ మతం కాళ్ల కింద నలిగిపోవాల్సిందీ మనమే. డబ్బున్న వర్గాలు హాయిగా వేడుక చూస్తూ కూర్చుంటాయి. ఇంటి నుంచి సామాన్లు తీసుకుని, అల్లరి చేస్తున్న పిల్లల్ని వెంటేసుకొని, తాళాలు సరిగ్గా వేశామా, లేదా అని మనసులో గుబులు మోసుకుని, టికెట్లు తీసుకుని, లేదా సొంతంగా బండ్లు కట్టుకొని, ఆ రోడ్ల మీద ఒళ్లు హూనం చేసుకుని, ఎక్కడపడితే అక్కడ దొరికే తిండి తిని, లేదా ఇంటి నుంచి పట్టుకెళ్లిన పులిహోర, పూరీలు ఆరగించి, చలికి గజగజ వణికి, నలుగురు పట్టే చోట ఎనిమిది మంది ఇరికి, చిట్టచివరకు అక్కడికి చేరాక.. రూం దొరుకుతుందో లేదో, ఖాళీ ఉంటుందో లేదో, స్నానానికి వేణ్నీళ్లు దొరుకుతాయా, దర్శనం ఎప్పుడవుతుందో ఏమో, ఎన్ని గంటలు నిరీక్షించాలో ఏంటో, లడ్డూలు ఎన్ని ఇస్తారో, దర్శనం తర్వాత షాపింగ్‌కి ఎంతసేపు పట్టొచ్చు, అన్నప్రసాదం హాల్‌కి వెళ్తే తొందరగా బయటకు వస్తామా, ఇంట్లోకి రాగిచెంబు కొనాలా, ఇత్తడి చెంబా, చుట్టుపక్కల వారికి పంచడానికి చిన్నఫొటోలు చాలా, పెద్ద ఫొటోలు కొందామా, లక్ష్మీదేవి ఇత్తడి విగ్రహం ధర ఎంతుంటుందో అంటూ మనసులో వంద రకాల లెక్కలు వేసుకుంటూ.. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మే సరుకుల్ని అవసరార్థం కొనుక్కుంటూ, అమ్మిన వారిని తిట్టుకుంటూ, క్యూలైన్లలో కునుకుపాట్లు పడుతూ, నక్కుతూ, ముక్కుతూ, వచ్చే కాలకృత్యాలను ఆపుకుంటూ, ఒకర్ని తోసుకుంటూ, మరొకరి చేత తోయబడుతూ, ఆడవాళ్ల శరీరాలను మగవాళ్లు గుద్దుతూ, మగవాళ్ల దేహాల్ని ఆడవాళ్లు తోసేస్తూ, దూరంగా ఎవరైనా సినిమా సెలబ్రెటీ కనబడితే వారివైపు చెయ్యూపుతూ, వీలైతే పరిగెత్తుకుంటూ వెళ్లి వాళ్లకు షేక్‌హ్యాండ్లు ఇస్తూ.. ఇన్నిన్ని బాధల మధ్య కూడా.. 'పుణ్యక్షేత్రాలకు వెళితే మనసుకు చాలా ప్రశాంతంగా ఉంటుంది' అని అంటారు చూడండి! అబ్బా! అంతకంటే పెద్ద ప్రపంచ వింత మరోటి కనిపించదు. ఇన్ని ఈతిబాధల మధ్య ఇంకేం ప్రశాంతత? ప్రశాంతత అక్కర్లేని, పవిత్రత అర్థం తెలీని, శుభ్రత స్పృహలేని, సంయమనం పాటించే ఓపిక లేని భక్తి మనది.. భాష, ప్రాంత, ఆడా మగా, బీద ధనిక, అక్షరనిరక్షరాస్యులు అనే భేదాల్లేవిక్కడ. ఒక పెద్ద గాట తీసుకొచ్చి అందర్నీ కట్టి పడేయచ్చు. అరమోడ్పు కళ్లతో మూడు అరక్షణాలు మాత్రమే దర్శించగల దేవుడి కోసం కళ్లు పూర్తిగా మూసుకుపోయి ఒకరినొకరు తోసుకుని ఒకరి మీదికి ఒకరు ఎక్కి తొక్కి ప్రాణాలు తీయగల మూఢ భక్తులున్నంత కాలం ఇది ఇలాగే జరుగుతుంది. దేవుడిని, సంప్రదాయాన్ని, మతాన్ని, ధర్మాన్ని తిట్టుకుని ప్రయోజనం లేదు. మనుషులు, భక్తులు ఇలా ఉన్నంతకాలం జీవితానికి నువ్విచ్చే విలువ ఇదే అయితే అది కోల్పోయినందుకు ఎవరినో తప్పుపడుతున్నావెందుకు? సంధ్య థియేటర్లో జరిగిన దానికీ, దీనికీ పెద్ద తేడా లేదు. హీరోలూ ప్రేక్షకదేవుళ్లే కదా. మతం మన జీవనశైలి కావాలి.. జీవన విధానం కావాలి.. బతికే దారి చూపాలి.. అంతేతప్ప ఉందో లేదో తెలియని స్వర్గం కోసం ద్వారాలు తెరిచే వుంటాయని చెప్పకూడదు. ఇక్కడ లేనిది పరలోకంలో ఉంటుందని భ్రమపెట్టడమే ఇన్ని తప్పిదాలకు, ఇన్ని ప్రాణాలు హరించుకుపోడానికి కారణం కారాదు.

ఏ మతమైనా ఈ భూమి మీద పుట్టినవే.. మనిషి సృష్టించినదే. మనం బతకడానికి తెచ్చుకున్న మతం మనం చావడానికి కారణభూతం అయితే ఆ తప్పెవరిది.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లావ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్తరద్వారం గుండా విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నారు. ఈ రోజు ను విష్ణువును దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. ఎచ్చెర్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు శుక్రవారం స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని అప్పుడే మనిషి జీవితం క్రమశిక్షణతో ముందుకు వెళ్తుందన్నారు. ఆలయ అర్చకులు స్వామి వారి కండువాను సూర శ్రీనివాసరావుకు వేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఆధ్యాత్మిక చింతనతో మెలిగే వారిలో మానసిక ప్రశాంత ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భక్తులు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదాలను ఏర్పాటు చేశామని సూర శ్రీనివాసరావు తెలిపారు.

# ఖచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమే



(సత్యంన్యూస్, రణస్థలం)

తిరుపతిలో తొక్కిసలాట ఘటన చోటుచేసుకొని భక్తులు మరణించడం చాలా బాధాకరమని, వైకాపా సీనియర్ నాయకులు పిన్నింటి సాయికుమార్ పేర్కొన్నారు. ఈమేరకు రణస్థలంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క సినిమా ఫంక్షన్‌కి మంత్రులు కలెక్టర్ అధికారులు రివ్యూ చేసుకుంటారని, ఇంతపెద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నపుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇది ఖచ్చితంగా కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో తిరుమల తిరుపతి దేవస్థానంలో గతంలో ఎప్పుడు ఇలాంటి సంఘటన ఇంతకు ముందు జరగలేదని, భక్తుల మరణాల పాపం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగులుతుందన్నారు. ముక్కోటి ఏకాదశి ప్రతీ సంవత్సరం జరిగే కార్యక్రమం కనీస ఏర్పాట్లు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి పాలక మండలి, టిటిడి అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. తిరుపతి లడ్డులో కలపని కల్తీనెయ్యిపై గగ్గోలు పెట్టి ఆరు రోజులు దీక్ష చేసిన పవన్‌కళ్యాణ్‌కు ప్రయోగరాజ్‌లో మునిగి పాప ప్రక్షాళన చేసుకుంటారో లేకపోతే నైతిక బాధ్యతగా కూటమి నుండి బయటకు వెళ్తారో నిర్ణయించుకోవాలన్నారు. వైకాపా హయాంలో ఇలాంటి సంఘటన ఎప్పుడు ఇటువంటి సంఘటన జరగలేదని, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇలాంటి సంఘటన చోటు చేసుకుందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో చేసే ఏర్పాట్లలో చాలా లోటుపాట్లు ఉన్నాయన్నారు. వైకుంఠ ద్వారం దర్శనం టోకెన్లు జారీ చేసే కేంద్రాలలో ఉదయం నుంచి ఉన్న భక్తులకు కనీసం మంచి నీళ్లుగాని ఇవ్వలేదు, కనీస ఏర్పాట్లు కూడా చేయలేదన్నారు. ఉదయం నుంచి భక్తులను లైన్లో ఉంచి సాయంత్రం ఒక్కసారిగా గేట్లు తీసి లోపలికి పంపించడంతో ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. ప్రభుత్వం గాని, అధికారులు గాని, పోలీస్ వ్యవస్థ గాని, సామాన్యప్రజలకు సరైన పాలన అందించడం లేదనడానికి తిరుపతిలో జరిగిన ఈ దుర్ఘటనే నిదర్శనమన్నారు. సమావేశంలో జడ్పీటీసీ టొంపల సీతారాం, వైకాపా మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు మహంతి చిన్న రామునాయుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, బోనెల చంద్రశేఖర్, మింది శ్రీనివాస్, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వమే బాధ్యత వహించాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)



ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో తొక్కిసలాటలో భక్తులు మృతికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని, భద్రతను గాలికి వదిలేసి ఆరుగురు మృతి ఘటనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మాజీ డిప్యూటీ సీఎం, వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది ప్రభుత్వం చేసిన తప్పు. ప్రభుత్వమే దీనికి పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం తప్పిదంగా ఒప్పుకుంటూ ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. వారు డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లేటప్పుడు కనీసం రూ.5లక్షలు అందించాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ ఘటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి, టీటీడీ చైర్మన్, ఈవో, అడిషనల్ ఈవో, ఎస్పీ, కలెక్టర్, రెవెన్యూ అధికారులు అందరూ బాధ్యత వహించాల్సిందేనన్నారు.



స్థానిక గొంటివీధిలో ఉన్న అర్బన్‌సెంటర్లో ఉంటున్న నిరాశ్రయులకు స్మాల్ సర్వీస్ టు సొసైటీ ద్వారా సీర సూర్యారావు శుక్రవారం స్టీల్‌ప్లేటు, స్టీల్‌గ్లాసు, స్టీల్ వాటర్ బాటిల్, బిస్కెట్ ప్యాకెట్‌ను తన సొంత ఖర్చులతో అందించారు. కార్యక్రమంలో జగన్, మధు, కలివరపు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.




భారతీయ సినిమాకు శంకర్ ఓ గేమ్ చేంజర్. వెండి తెరకు భారీదనాన్ని పరిచయం చేశాడు. పాటల్లో తన మ్యాజిక్ చూపించాడు. విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఎలా ఉంటుందో చూపించాడు. ఓ సామాజిక అంశానికి కమర్షియల్ హంగులు అద్దడంలో సిద్ధహస్తుడు అనిపించుకొన్నాడు. ఎంత గొప్ప కట్టడమైనా, ఎప్పుడో ఒకప్పుడు బీటలు వారుతుంది. శంకర్ కెరీర్‌కూ అది ఎదురైంది. వరుసగా ఫ్లాపులు తగిలాయి. భారతీయుడు-2 అయితే శంకర్ పని అయిపోయిందా? అనే అనుమానాన్ని కలిగించింది. కానీ.. ఎక్కడో ఓ చిన్న నమ్మకం. భవనం బీటలు వారినా, పునాది గట్టిగా ఉంటుందిలే అనే నమ్మకం. ఆ నమ్మకమే గేమ్ చేంజర్‌పై కూడా ఉంది. ఆర్.ఆర్.ఆర్ తరవాత రామ్ చరణ్ నటించిన సినిమా ఇది. స్టార్ ప్రొడ్యూసర్, తెలుగు సినిమా పరిశ్రమకు ఆయువు పట్టులాంటి నిర్మాత దిల్ రాజు 50వ సినిమా కూడా ఇదే. అందుకే గేమ్ చేంజర్‌పై నమ్మకాలు సడల్లేదు. పైగా ట్రైలర్‌లో శంకర్ మార్క్ విజువల్స్ కనిపించాయి. ప్రెస్‌మీట్లు ఇంటర్వ్యూలలో చరణ్‌కు ఈ సినిమాతో నేషనల్ అవార్డు వస్తుందని బల్లగుద్ది మరీ చెప్పారు దర్శక నిర్మాతలు. అన్నింటికంటే ముఖ్యంగా ఇది సంక్రాంతి బరిలో నిలిచిన సినిమా. మరి ఇన్ని ప్రత్యేకతల నడుమ విడుదలైన గేమ్ చేంజర్ ఎలా వుంది? నిజంగానే శంకర్ మార్క్ ఉందా? ఆర్.ఆర్.ఆర్ తరవాత చరణ్ విజయ పరంపర కొనసాగించాడా?

# అవుట్ డేటెడ్!!

రామ్ నందన్ (రామ్ చరణ్) విశాఖకు కలెక్టర్‌గా వస్తాడు. ఏపీలో అభ్యుదయం పార్టీ అధికారంలో ఉంటుంది. ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) చేతిలో మరో యేడాది అధికారం ఉంటుంది. ఈ యేడాది అవినీతిని పక్కన పెట్టి, ప్రజలకు సేవ చేయాలని మంత్రుల్ని, ఎం.ఎల్.ఏలను ఆదేశిస్తాడు. సత్యమూర్తి తనయుడు మోపీదేవి (ఎస్.జె.సూర్య)కు తండ్రి సీటుపై గురి. తండ్రి ఎప్పుడు పోతాడా? సీఎం ఎప్పుడు అయిపోదామా అని కాచుకొని కూర్చుంటాడు. మరోవైపు కలెక్టర్ కొరకరాని కొయ్యలా తయారవుతాడు. మోపీదేవి అక్రమాలకు చెక్ పెడతాడు రామ్ నందన్. ఈలోగా సత్యమూర్తి చనిపోతాడు. ఆ స్థానంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా మోపీదేవిని పార్టీ పెద్దలు బలపరుస్తారు. మోపీదేవినే సీఎం అని అంతా ఫిక్సయిపోయే తరుణంలో ఈ కథ మలుపు తిరుగుతుంది. రామ్ నందన్‌కు సంబంధించిన ఓ నిజం బయటపడుతుంది. అదేమిటి? ఆ తరవాత ఏమైంది? ఫ్లాష్ బ్యాక్‌లో అప్పన్న (రామ్ చరణ్) కథేమిటి? తనకూ సత్యమూర్తికి ఉన్న సంబంధం ఏమిటి? అనేది తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

పోకిరి, ఒక్కడు లాంటి కమర్షియల్ సినిమా చేయాలని తనకు ఉండేదని, ఆ ఆలోచన నుంచి వచ్చిన సినిమా 'గేమ్ చేంజర్' అని శంకర్ ఓ సందర్భంలో చెప్పాడు. మన తెలుగు సినిమాలు శంకర్‌కు స్ఫూర్తి ఇవ్వడం వరకూ ఓకే. తెలుగువాళ్లుగా మనం గర్వించాలి. కాకపోతే.. ఇది పోకిరి, ఒక్కడు జమానా కాదు. తరం మారిపోయింది. ఆలోచనలు మారాయి. కమర్షియల్ పంథా కూడా మారిపోయింది. పోకిరి, ఒక్కడు హిట్ అయ్యాయంటే, అప్పటికి అవి పాత్ బ్రేకింగ్ సినిమాలు. ఓ కొత్త పంథాలో సాగిన కమర్షియల్ పాయింట్స్. అంతెందుకు? శంకర్ తీసిన భారతీయుడు, ఒకే ఒక్కడు.. సినిమాలు కూడా పాత్ బ్రేకింగ్ సినిమాలే. కమర్షియల్ సినిమాల్ని కొత్త దారి పట్టించిన సినిమాలు. అయితే ఇప్పుడు కూడా అదే దారిలో వెళ్లి సినిమాలు తీస్తానంటే కుదరదు. మారిన అభిరుచులు, ప్రేక్షకుల ఆలోచన సరళిని బట్టి కథలు మారాలి. అందులో హీరోయిజం మారాలి. దురదృష్టవశాత్తూ 'గేమ్ చేంజర్'లో ఇది జరగలేదు.

ఓ నిజాయతీగల ఆఫీసర్‌కీ, అవినీతి పరుడైన మంత్రికీ మధ్య జరిగిన పోరాటం ఇది. టిట్ ఫర్‌టాట్‌లా సాగే సన్నివేశాలతో కథని రక్తికట్టిద్దామనుకొన్నాడు శంకర్. ఆలోచన వరకూ బాగుంది. మరి ఆచరణ? ఇప్పటికీ ఒకే ఒక్కడు ఫార్మెట్ లోనే సన్నివేశాలు అల్లుకొని, కథని నడిపించేద్దామనుకొన్నాడు శంకర్. ఒకేఒక్కడులో అర్జున్ వ్యవస్థపై పోరాటం చేశాడు. కానీ ఇక్కడ హీరో పోరాటం ఓ వ్యక్తిమీద. దాంతో విస్తృతంగా చెప్పాలనుకొన్న ఓ అంశాన్ని తనకు తానుగా కుదించేసుకొన్నాడు శంకర్. రౌడీషీటర్లను, అడ్డగోలుగా సంపాదిస్తున్న వ్యాపారస్థుల్ని రెండు బస్సుల్లో ఎక్కించుకొని.. విశాఖపట్నమంతా తిప్పుతూ, అక్కడిక్కడే రూల్స్ అమలు చేసేలా తీర్చిదిద్దిన సన్నివేశాలు 'ఓకే' అనిపిస్తాయి అంతే. అంతే తప్ప.. అక్కడ శంకర్ మార్క్ కనిపించదు. శంకర్ ఇంతకు మించి కదా ఆలోచించాలి? అనిపిస్తుంది. ఫ్లాష్‌బ్యాక్‌లో కాలేజీ సన్నివేశాల్లో హీరో తాలుకూ కోపం అనే ఎలిమెంట్‌కు ప్రేక్షకులు అంతగా కనెక్ట్ కారు. అక్కడ కామెడీ కూడా పండలేదు. కోపాన్ని తగ్గించుకోవడానికి హీరో నడి రోడ్డు మీద మనకు శంకర్ ఏమిటి.. ఇలా ఆలోచిస్తున్నాడు? అని కోపం వస్తుంది.

ఇంట్రవెల్ బ్యాంగ్ దగ్గర ఓ ట్విస్టు వుంది. అది సినిమాపై కాస్తంత ఆసక్తి పెంచుతుంది. ఇంట్రవెల్ తరవాత అప్పన్న ఎపిసోడ్ మొదలవుతుంది. ఫ్లాష్‌బ్యాక్‌పై శంకర్ కాస్త హోమ్ వర్క్ చేసినట్టు కనిపిస్తుంది. దానికితోడు అప్పన్న క్యారెక్టర్ కోసం చరణ్ తన సిన్సియర్ ఎఫెక్ట్ పెట్టాడు. ఆ పదిహేను నిమిషాలూ చరణ్ నటనకు అరెస్ట్ అయిపోతాం. అయితే ఆ తరవాత మళ్లీ యధారాజా, తధా ప్రజా అన్నట్టు రొటీన్ సన్నివేశాలు విసిగిస్తాయి. రామ్ నందన్ ఎలక్షన్ కమీషనర్‌గా రావడం కాస్త హై ఇచ్చే మూమెంటే. కానీ.. ఎలక్షన్ కమీషనర్ కీ, ముఖ్యమంత్రికీ జరిగిన డ్రామా అంతగా రక్తి కట్టలేదు. ప్రీ క్లయిమాక్స్‌లో మదర్ సెంటిమెంట్‌ని నమ్ముకొన్నారు. అది కాస్త హార్ట్ టచింగ్ గానే తీశారు. అది పూర్తవగానే మళ్లీ రొటీన్ ఫైట్. క్లైమాక్స్ ఫైట్.. బహుశా శంకర్ కెరీర్‌లోనే వీకెస్ట్ యాక్షన్ ఎపిసోడ్‌లా అనిపిస్తుంది. చరణ్ నటుడిగా ఎక్కడా నిరాశ పరచడు. కలెక్టర్‌గా హుందాగా కనిపించాడు. తన అప్పీరియన్స్ బాగుంది. అప్పన్న పాత్రలో.. మరింత రాణించాడు. అక్కడ రంగస్థలం నాటి చరణ్ కనిపిస్తాడు. ఈ సినిమాని కాపాడేందుకు అప్పన్న శక్తి వంచన లేకుండా కృషి చేశాడు. ఈ సినిమాతో చరణ్‌కు నేషనల్ అవార్డు వస్తుందని అంతా అన్నారు. అంత కాకపోయినా..చరణ్‌లోని నటుడ్ని మరోసారి చూశామన్న సంతృప్తి అభిమానులకు దొరుకుతుంది. ఎస్.జె.సూర్య రొటీన్, లౌడ్ విలనిజాన్ని చూపించాడు. కొన్నిసార్లు విసిగిస్తాడు కూడా. కైరాది కమర్షియల్ కొలతల్లో సాగిపోయే హీరోయిన్ పాత్ర. అంజలి గెటప్ ఆశ్చర్యపరుస్తుంది. మెడ పక్కన పెట్టే మేనరిజం అంజలితో పాటుగా, సునీల్‌కీ ఎందుకు ఇచ్చారో అర్థం కాదు. దిల్ రాజు కెరీర్ లోనే కాస్ట్లీ సినిమా ఇది. ఆ భారీదనం తెరపై కనిపించింది. జరగండి.. తోప్ పాటలు కలర్‌ఫుల్‌గా అనిపించాయి. తమన్ ఆర్.ఆర్ ఓకే అనిపిస్తుంది. కొన్ని చోట్ల లౌడ్‌నెస్ ఎక్కువ ఉంది. యాక్షన్ సీన్లు మరీ గొప్పగా లేవు. క్లైమాక్స్ ఫైట్ చాలా వీక్. 'నానా హైరానా' పాట సినిమాలో లేదు. మళ్లీ ఎప్పుడో కలుపుతారట. బుర్రా సంభాషణలు అక్కడక్కడ మెరిశాయి. అయితే.. కామెడీ రాయడంలో ఆయన కలం చాలా వీక్. ఈ సినిమాతో అది మరోసారి నిరూపితమైంది. శంకర్ మామూలు కమర్షియల్ దర్శకుడిగా మారిపోయి, సేఫ్ గేమ్ ఆడేద్దామని తీసిన సినిమాలా అనిపిస్తుంది. శంకర్ సినిమాలు చూడ్డానికి ప్రేక్షకుడు ప్రత్యేకంగా సిద్ధమవుతాడు. ఆ ప్రత్యేకత మిస్ అయ్యింది. ఆరో తరగతిలో ఓ సోషల్ పాఠం ఉంటుంది. కలెక్టరు ఎవరు? ఆయన అధికారాలు ఏమిటి? అని. ఆ సోషల్ పాఠాన్ని సినిమాగా తీస్తే గేమ్‌చేంజర్ అవుతుంది. అదనంగా.. చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ అధికారాల్ని కూడా చూపించారు. కలెక్టర్‌కీ, ఎలక్షన్ ఆఫీసర్‌కీ ఇన్ని అధికారాలు ఉంటాయా? అనే ఆశ్చర్యం, కొంత ఇన్‌ఫర్మేషన్.. ప్రేక్షకులకు వస్తుంది. కానీ అది ఇంటర్నెట్ లోనూ దొరుకుతుంది. శంకర్ లాంటి దర్శకుడు ఇంతకు మించి కదా చెప్పాలి? ఎక్కడా శంకర్ మార్క్ లేకుండా, శంకర్ తీసిన ఫక్తు.. కమర్షియల్ సినిమా ఇది. సంక్రాంతికి రావడం ఈ సినిమాకు ప్లస్ పాయింట్. అయితే మిగిలిన రెండు సంక్రాంతి సినిమాల ఫలితాలపైనే ఇప్పుడు గేమ్ చేంజర్ జాతకం ఆధారపడి వుంది.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# అంబేద్కర్‌ను హేళన చేయడం న్యాయమా?



**ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎట్లా జరుగుతాయో తెలియదు. న్యాయ వ్యవస్థను బతకనిస్తారో లేదో తెలియదు. సక్రమంగా సాగే పార్లమెంటరీ చర్చలు జరుగుతాయనే నమ్మకాలు పోతున్నాయి. ఇంతకుముందు ఎప్పుడూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గురించి పార్లమెంట్ లో గానీ అంతకుముందు రాజ్యాంగం రచిస్తున్న సందర్భంలో కూడా ఇటువంటి పరిస్థితులు రాలేదు. అంబేద్కర్ గురించి విమర్శించే హక్కు లేదని ఎవరూ అనలేరు.**

### "ఆర్ వి ది పీపుల్ ఆఫ్ ఇండియా?"

వి ది పీపుల్ ఆఫ్ ఇండియా అనే మాట ఆంగ్లంలో తెలుగులో కూడా ఒక గొప్ప మంత్రం వలె నిలబడుతున్నది. అంటే మేము మనకోసం రూపొందించిన .. అని అంటారు. మొత్తం రాజ్యాంగ నిర్ణాయక సభ కలిసి రూపొందిం చినవి అని అనుకోవడం సరైనదా? ఆ 1950 కు ముందు ఉన్న భారత దేశ ప్రజలంతా కలిసి, వారి ప్రతినిధిగా ఈ సభ రూపొం దించింది కదా. అంటే ఆయన 1950 తరువాత తరాల వారికి ఇది వర్తించదా అని మరో ప్రశ్న. ఒకసారి సభ జరిగిన తరువాత ఎన్నికల ద్వారా ఈ భారత దేశం ఓటర్ల ద్వారా రాజ్యాంగ సంవిధానం సవరించిన ప్రతిసారీ ఇదే ప్రతీక అని గమనించాలి. వందసార్లు కనీసం కొత్త రాజ్యాంగం సవరించారు. చిన్నదో పెద్దదో, మంచిదో కాదో, అది వేరే విషయం. ఓ సారి సుప్రీంకోర్టు ధర్మాసనం కొట్టేసిన రాజ్యాంగసవరణలు ఉన్నాయి. చాలా బాగున్నాయని అనుకున్న ధర్మాసనం లు కూడా ఉన్నాయి. రాజ్యాంగ స్ఫూర్తితో అంబేద్కర్ దృక్పథం వలననే రాజ్యాంగ రచనలో ఏకాభిప్రాయం సాధ్యమైంది. లేకపోతే రాజ్యాంగమే వచ్చేది కాదు. "ఎందుకంటే భిన్నమైనటువంటి విలువలు కానీ రాజ్యాంగం స్వీకరించిన (adopt) రోజే ఈ రాజ్యాంగం మనదికాదని అనేవారు. అయినా రాష్ట్రీయ స్వయంసేవ సంఘ్ స్వయాన వాళ్ళు తిరస్కరించారు. "We reject the Constitution", "వి రిజెక్ట్ ది కాన్స్టిట్యూషన్" అన్నారు, ఇప్పటికీ వాళ్ళు రాజ్యాంగం వద్దనే మాటతో కట్టుబడి ఉన్నారు" అని ప్రముఖ పొలిటికల్ సైంటిస్ట్, రాజకీయ వేత్తలు ప్రజాస్వామ్య వాది జి హరగోపాల్ వివరించారు. ఇటీవల "భారత రాజ్యాంగ పీఠిక" పుస్తకం ఆవిష్కరించిన సందర్భంలో హరగోపాల్ గారు రాజ్యాంగ రచనలో అందరితో మాట్లాడుకునే లక్షణాలు కొనసాగాయి అని చెప్పారు.

### జై బాపు, జై భీం, జై సంవిధాన అభియాన్

భారత రాజ్యాంగం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జై బాపు, జై భీం, జై సంవిధాన అభియాన్ అనే నినాదం ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయించింది. పదేళ్లు భారత దేశాన్ని పరిపాలించిన మన్ మోహన్ సింగ్ 26 డిసెంబర్ నాడు మరణించారు. రెండు సంవత్సరాల దాకా "జై బాపు, జై భీం, జై సంవిధాన అభియాన్ అనే నినాదం" దేశమంతా వినిపించాలని నిర్ణయించారు.

విచిత్రమేమిటంటే ఆ రోజుల్లో పార్లమెంట్ సమావేశాల్లో అంబేద్కర్ గురించి అసందర్భంగా విమర్శించడం బాధాకరమైంది. పార్లమెంట్ హేళనకు గురికావడం ఆశ్చర్యకరం. "ఈ రోజుల్లో ఒక ఫాషన్ అయిపోయింది. అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ ఇన్నిసార్లు భగవంతుడితో అంబేద్కర్ అని భజన చేస్తే ఏడేడు జన్మల కాలంలో స్వర్గం దొరికే అవకాశం ఉండేది" అని ఎన్నికల సభలో కాదు, బిగ్ డిబేట్ అని టివి మాటల్లో అరుచుకోవడం కాదు. సర్వసత్తాగణతంత్రంలోని పార్లమెంట్ లో జరిగింది. అందుకని ఆశ్చర్యం. ఇది న్యాయం కాదని కొందరు, నేరం అని మరికొందరు పెద్దలు, లేదు లేదు వెంటనే ఎస్ ఐ ఆర్ పోలీస్ స్టేషన్ లో నమోదు చేయండి అని పార్లమెంట్ సభ్యులు అడుగుతున్నారు. పార్టీల ప్రస్తావన అవసరం లేదు. ఇటూ ఇటూ అంటే పార్లమెంట్ ప్రభుత్వ పక్షాలు, ప్రతిపక్షాలు కేసులు పెట్టుకోవాలని అంటున్నారు. కనుక ఇది ఆశ్చర్యం.

### ఇన్ని కోట్లు ఖర్చుచేసే చర్చ ఇదా?

కొన్ని వందల గంటల సమయాన్ని కోట్ల రూపాయలు ఖర్చుచేసి పార్లమెంట్ సమావేశాలలో చేస్తున్న చర్చలు ఇవేనా? అసలు చర్చలు ఎందుకు జరుగుతున్నదయి. దానికి నేపథ్యం ఏమిటి, దాని వల్ల ఎవరికి లాభం అని ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

అంబేద్కర్ గొప్పతనాన్ని తక్కువచేయడం మంచిది కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రమైన విమర్శలు చేసారు. ప్రెస్ మీటింగ్ చాలా అరుదుగా జరుగుతాయని మనకు అర్థమైంది. అయినా ఒక పత్రికా సమావేశం ఏర్పాటు చేసి "అంబేద్కర్ కు వ్యతిరేకంగా ఏమీ అనడం లేదు. నా మాటలు వక్రీకరించారు" అని హోం మంత్రి చెప్పుకోవలసిన దశవచ్చింది.

### పౌర శక్తి

ఇటీవల 2024 ఎన్నికలలో రాజ్యాంగం పేరుతో రాజకీయ నాయకులు అటూ ఇటూ బురదలు చల్లుకుంటున్నారు. రాజ్యాంగాన్ని రక్షించడం లేదని, కాపాడడం లేదని అంటూ విమర్శించుకుంటున్నారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని చేతిలో పట్టుకుని ఎన్నికల సమావేశాల్లో మాట్లాడుకున్నారు. 400 ఎంపీ స్థానాలలో గెలుచుకుని బిజెపి తిరుగులేని అధికారాన్ని చెలాయిస్తామని బోలెడు ఆశలు పెట్టుకున్నారు. కాని ఆలోచించే ఓటర్లు పౌరశక్తి ఎంత గట్టిదో ఎంత గొప్పదో చాటి చెప్పారు. టిడిపి, జెడియు ఎంపీలు లేకపోతే బిజెపి అధికారానికి పరిమితులు వివరించింది. ఇష్టం వచ్చినట్టు పరిపాలన చేసే అవకాశం లేదని అధికార గుర్రాలకు కళ్లెం బిగించి, తలకెక్కిన కళ్లను దించింది మన ఓటర్లు. ప్రజాస్వామ్యం బతికి ఉంటుందని రుజువు చేసారు. చంద్రబాబునాయుడు, నితీశ్ కుమార్ నేతలు ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని నడపడానికి బలం అదించారు. కేంద్రాలకు రాష్ట్రాలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహిస్తామన్న దూకుడులను కాసేపు ఆపగలిగిన శక్తి సంపాదించింది.

రాజకీయ నైపథ్యం ఈ విధంగా ఉన్నప్పటికీ రాజ్యాంగ నిర్మాత బి ఆర్ అంబేద్కర్ ను హేళన చేయడం న్యాయం కాదు. అయినా వివరణలు ఖండనలు చెప్పుకుంటూ అంబేద్కర్ ను అవమానం చేయడం మా ఉద్దేశం కాదు అని దుస్థితికి అధికార పార్టీ జారిపోవడం ప్రస్తుతం కొంచెం నయమే అనిపిస్తుంది. కాని భారత రాజ్యాంగాన్నిపూర్తిగా మార్చుకునే ఎజెండా ను వదులుకోవడం లేదు. సమాచార హక్కు తో సహా అనేకానేక ప్రాథమిక హక్కులకు బలహీనం చేస్తున్నారు. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు వల్లనే మౌలిక స్వరూపాన్ని చిందరవందర చేసి ప్రయత్నాలు తెచ్చిపెట్టారు. అందులో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతినే ప్రమాదం ఇంకా కొనసాగుతున్నదే ఉంది. పార్లమెంట్ లో గత నెల అంబేద్కర్ ప్రతిష్టకు కూడా దెబ్బతినే ప్రయత్నాలు ఉన్నాయని కనపడుతూనే ఉంది.

రాజ్యాంగాన్ని కూలంకషంగా మార్చుకోవడానికి సుదీర్ఘ ప్రణాళిక ఉండనే ఉంది, ఈ లోగా అంబేద్కర్ ను హేళన చేసే కార్యక్రమాల వెనుక జనాల దృష్టి మరలించే వ్యూహాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు నమ్ముతున్నారు. డి ఎం కే ప్రభుత్వం చాలా స్పష్టంగా ఇదే వ్యూహం అని కుండబద్దలు చేస్తున్నారు కూడా. ఇవన్నీ నాటకాలు అని దారుణంగా విమర్శించారు.

ఏది ఏమైనా మన రాజ్యాంగాన్ని, దాని మౌలిక స్వరూపాన్ని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడికీ, ఒక్కొక్క ఓటరుకూ ఉంది.

మాడభూషి శ్రీధర్, (న్యాయ శాస్త్ర ఆచార్యులు, హైదరాబాద్)

## 'గాయత్రి' లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మునసబుపేటలోని గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి దర్పణమని, ఈ తరం దీనిని కొనసాగించటం, ముఖ్యంగా విద్యార్థులు నిర్వహించటం ఆనందకరమన్నారు. హరిదాసు నాలుగురోజుల పండగ గురించి చెప్పి, హరికీర్తనలు ఆలపించారు. విద్యార్థుల అట, పాటలతో సందడి చేశారు. అనంతరం భోగి మంటను ప్రిన్సిపాల్ వెలిగించారు. ప్రసాద వితరణ చేసారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు, కరస్పాండెంట్ రంగారావు, సీతారామూర్తి నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కేవీవీ సత్యన్నారాయణ, కెప్టెన్ వంగమహేష్, రాజకుమార్, బాలసుందర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


## బొద్దూరులో ముందస్తు సంక్రాంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మొదటగా ఉపాధ్యాయులు విద్యార్థులు పౌష్యలక్ష్మికి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు గాలిపటాల పోటీలను నిర్వహించారు. ఒక గోమాతను తెచ్చి చుట్టూ బోగి స్థలం చుట్టూ తిప్పి పూజలు చేశారు. విద్యార్థులు తాము తెచ్చుకున్న భోగి పిడకలను ప్రదర్శించారు. ఇవి మన సాంప్రదాయాలని వీటిని మనము నిత్యము పాటించాలని సూచించారు. అనంతరము భోగి మంటను వేసి కేరింతలు వేసి ఆనందోత్సవాలతో గడిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు దామోదరరావు, పురుషోత్తం, లక్ష్మీబాను సత్యనారాయణ, ప్రసాదు, శ్రీరాం, సూర్యకుమారి, భవాని, కృష్ణ, రమేషు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారికి కుంకుమార్చనలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక పాత శ్రీకాకుళంలో కొలువైన సంతోషిమాత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, శ్రీ సూక్తం, విధానముగ షోడశోపచార సహిత సహస్రనామార్చన కుంకుమపూజ, అమ్మవారి జపం, అష్టోత్తర శతనామార్చన కుంకుమ పూజ, శ్రీ దేవీ ఖడ్గమాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకపూజలు, అర్చనలు, లలితా సహస్రనామ పారాయణం, విశేష అర్చనలు, నీరాజనం, మంత్రపుష్పము, మహాహారతి, వేద ఆశీర్వచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి కె.సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు దుస్తుల వితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మండలంలో తామాడ గ్రామంలో శ్రీకాకుళం పట్టణ పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టుశాలీ కులస్థుల నిరుపేదలకు శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతిఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా జిల్లాలోని సురవరం, బొంతలకోడూరు, శ్రీకాకుళం పట్టణం, దేవరవలస, జాడపేట, బొంతువలస, పొందూరు మెట్ట, చంద్రయ్య పేట, బొంతువలస గ్రామాల్లో 350 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు, గుంటుక చంద్రశేఖర్, పేకల రామకృష్ణలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రాజాపంతుల కృష్ణమోహన్, కోశాధికారి అల్లంశెట్టి మోహనరావు, సంఘం నాయకులు మాడుగుల బస్వరాజు, దండా హరీష్, అల్లంశెట్టి వెంకట్రావు, కాపల రాము, పూంద్రు సింహాద్రప్పుడు పాల్గొన్నారు.



## పాదరక్షల సేవ..పవిత్ర సేవ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకుంఠఏకాదశి పర్వదిన సందర్భంగా స్థానిక పిఎన్ కాలనీలో వెలసి ఉన్న వెంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తుల పాదరక్షలు ఉచితంగా భద్రపరుచుకునే సేవను శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు సూచన మేరకు భక్తుల సౌకర్యార్థం ఉదయం నాలుగు గంటల నుండి పాదరక్షలు భద్రపరుచు సేవ అత్యంత పవిత్రమైనదిగా భావించి, త్వరితగతిని సేవలు అందించేందుకు టోకెన్లు ఏర్పాటు చేసి ఈ సేవను నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సేవలో జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఇంచార్జ్ బోయిన నరసింహమూర్తి, బాలవికాస్ రిసోర్స్‌పర్సన్ లాడి చంద్రశేఖర్, జోనల్ కన్వీనర్ శివన్నారాయణ దంపతులు, పిన్ కాలనీ మందిరం కన్వీనర్ రమణమూర్తి, మందిరం సేవాదళ్ కూన గణపతిరావు, పూజారి ఆనంద్, సూర్యనారాయణ మాస్టారు, అప్పారావు, అనంతయ్య, మహిళా సేవాదళ్ పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టికెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి, రైల్వే, ఫ్లైట్ టికెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజ్ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

# విశ్వానికి దిక్సూచి.. స్వామి వివేకానంద



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచానికి గొప్ప మార్గనిర్దేశనం చేసిన స్వామి వివేకానంద విశ్వానికి దిక్సూచి వంటివారని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి సారథ్యంలో నిర్వహిస్తున్న జాతీయ యువ జన వారోత్సవాల ఐదవ రోజు కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుని జీవిత చరిత్రను అధ్యయనం చేయాలని, యువత వివేక మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కన్వీనర్ డాక్టర్ ఆర్.హరిత, యువజనోత్సవాల కన్వీనర్ మందపల్లి రామకృష్ణారావు, ఐ.సంతోష్‌కుమార్, ఎస్.జగన్నాథరావు, కె.పద్మావతి, పి.మాలతి, భానుమూర్తి, కిరణ్, వినయ్, వీరాస్వామి, పార్వతీశ్వరరావుతో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజవేణుగోపాలస్వామి ఆలయంలో
# ఉత్తర ద్వార దర్శనం



(సత్యంన్యూస్, రేగిడి)

పనసలవలస శ్రీ రాజవేణుగోపాలస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం ఏర్పాటుచేశారు. రాజవేణుగోపాలస్వామి పాలకడలిలో ఉన్నట్లు విశేష పుష్పలంకరణ చేసారు. ఉత్తర ద్వారం ద్వారా రాముడు, వెంకటేశ్వర స్వామి, రాజవేణు గోపాల స్వామి, గోదాదేవి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేసి దర్శనం కల్పించారు. ధనుర్మాసం సందర్భంగా రోజూ ఆండాళ్ అమ్మవారికి తిరుప్పావై, అష్టోత్తరపూజలు చేస్తున్నట్లు వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాదాచార్యులు, రామానుజ స్వర్ణకుమార్, ప్రధాన అర్చకులు పీసపాటి రవి ఆచార్యులు తెలిపారు. ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారిని పరిసర గ్రామ ప్రజలతో పాటు జిఎమ్ఆర్ కేర్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దామెర రాజేంద్ర దంపతులు దర్శనం చేసుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేసారు. శనివారం కూడా విశేష ప్రసాద నివేదన చేయనున్నట్లు రంగనాదాచార్యులు తెలిపారు.

## పశుసంవర్థక శాఖలో
# అక్రమాలపై విచారణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పశుసంవర్ధక శాఖలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి రూ.11 కోట్లు పశుదాణాకు ఖర్చు చేసినట్టు చూపించి కుంభకోణానికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై త్రిమెన్ కమిటీ విచారణ నిర్వహించారు. జేసీ ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆధ్వర్యంలో కమిటీ విచారణ జరిపింది. విచారణలో జేడీ కార్యాలయ అధికారులను 11 అంశాలపై వివరణ కోరినట్టు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేసి అర్జీదారుల సమక్షంలో శాఖ అధికారుల నుంచి అంశాల వారీగా త్రీమెన్ కమిటీ వివరణ కోరింది. ఇదే అంశాలపై 'సత్యం' పత్రిక వరుస కథనాలను ప్రచురించింది. వీటిపై కూడా అధికారులు వివరణ కోరినట్టు తెలిసింది. విచారణలో శాఖ అధికారులు ఇచ్చిన వివరాలను పొందుపరిచి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు త్రిమెన్ కమిటీ నివేదిక ఇవ్వనున్నారు.



# టీడీపీ అధ్యక్షుడి నోట.. అద్దుగోలు మాట

(మొదటిపేజీ తరువాయి)

చెందిన వ్యక్తులకు కాంట్రాక్ట్ అప్పగించారు. ఈ తవ్వకాల కారణంగా మాతల వంతెనకు నష్టం కలుగుతుందని గ్రామస్తులు ఆందోళన చేసినా ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. కలమట వెంకటరమణ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నివగాం రీచ్ నిర్వాహకులతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ అధ్యక్షులు కలమట వెంకటరమణ ఇద్దరికీ సత్సంబంధాలు ఉన్నాయి కాబట్టి దీని మీద ఎవరూ మాట్లాడటంలేదని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. ఆకులతంపర వద్ద డీసిల్ట్రేషన్ చేయడానికి శ్రీకాకుళానికి చెందిన వ్యక్తులు కాంట్రాక్ట్ అప్పగించారు. స్కై ఇన్‌ఫ్రా పేరుతో అప్పటికప్పుడు ఓ సంస్థను సృష్టించి తవ్వకాలకు అర్హతను పొందారు. ఈ రెండుచోట్లా తవ్వుతున్న ఇసుక నేరుగా విశాఖపట్నం తరలిపోతుంది. ఆకులతంపర విషయంలో ఇద్దరూ అసంతృప్తితో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే ఈ నెల 5న మామిడి, కలమట సమావేశమై నివగాం, ఆకులతంపర ఇసుక తవ్వకాలపై మాట్లాడినట్టు చెప్పుకుంటున్నారు. ఆతర్వాత కలమట వెంకటరమణ గురువారం ఆకులతంపర వద్ద హడావుడి చేయడం ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

నివగాం వద్ద లేని అభ్యంతరం ఆకులతంపర వద్ద ఎందుకు వచ్చిందో కలమట వెంకటరమణకే తెలియాలి. నివగాం వద్ద భారీ యంత్రాల సహాయంతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఆకులతంపరలో డీ సిల్ట్రేషన్ పద్ధతిలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చినందున ఇక్కడ పూర్తిగా మాన్యువల్ ద్వారానే ఇసుకను తవ్వి ఒడ్డుకు చేర్చాలి. కానీ అది జరగడంలేదు. ఏకంగా నదీగర్భంలోకే ప్రొక్లెయినర్లను తీసుకెళ్లి తోడేస్తున్నారు. వాస్తవానికి ఈ రెండుచోట్లా నిరంతరం జేసీబీలు పని చేస్తునే ఉన్నాయి. పరిధికి మించి ఎప్పుడో తవ్వేశారు. జిల్లాలో అన్ని రీచ్‌ల్లో భారీ యంత్రాలను ఉపయోగించి, ఇసుక లారీలకు లోడ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. నివగాం, ఆకులతంపరలో నిబంధనలకు విరుద్ధంగా 2010 వంశధార గ్రీన్ ట్రిబ్యునల్ చట్టానికి వ్యతిరేకంగా అనుమతులకు మించి పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నదుల్లో మట్టితో బాటలు వేసి నేరుగా లారీలు, టిప్పర్లను తరలించి యంత్రాల సాయంతో లోడ్ చేస్తున్నారు. లారీల్లో లోడ్ చేసిన ఇసుకను విశాఖకు, టిప్పర్లలో లోడ్ చేసిన ఇసుకను జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఆకులతంపర వద్ద డీసిల్ట్రేషన్ పేరుతో నదిలో ఇసుక నిబంధనలకు విరుద్ధంగా నాలుగు ఐదు మీటర్ల లోతులో తవ్వడం వల్ల పెద్ద పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. నివగాంలో సాధారణ రీచ్ పేరుతో ఇసుకను 9 అడుగుల లోతులో తవ్వుతున్నారు. ఈ తవ్వకాల వెనుక కూటమి పెద్దలు, నాయకుల జోక్యం స్పష్టం. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంలోనే టీడీపీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ అకస్మాత్తుగా ఆకులతంపర ర్యాంపు వద్ద ప్రత్యక్షమై ఇసుకను అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని ఆందోళనకు దిగడం చర్చనీయాంశంగా మారింది. కలమట రమణ ఆందోళన చేయడంతో శుక్రవారం మైన్స్‌శాఖకు చెందిన డీడీతో పాటు సర్వేయర్ వరకు ఆకులతంపర ర్యాంపును పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు ఏమేరకు నివేదిక అందిస్తారో వేచిచూడాలి.

# కలెక్టర్ పిలిచారా? లైట్‌తీస్కో

మొదటిపేజీ తరువాయి

రెవెన్యూ సమీక్షకు సకాలంలో చేరుకోలేకపోయారు. ఇంతవరకు ఒక లెక్క. కానీ ఇప్పటి వరకు వచ్చిన గ్రీవెన్స్‌పై ఎటువంటి చర్యలు తీసుకున్నారు, ఎన్ని పరిష్కరించారన్న విషయాలు కలెక్టర్‌కు చెప్పేందుకు చాలామంది దగ్గర సమాధానాలు లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహానికి ప్రధాన కారణం. దీంతో 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం నుంచి వెళ్లిపోయిన కలెక్టర్ మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి రాత్రి 7.30 వరకు రెవెన్యూ సదస్సులు, అందులో వచ్చిన ప్రజాగ్రీవెన్స్‌లపై సమీక్షించారు.

సమీక్షలో రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లు, వీఆర్వోల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులు, సర్వే అంశాలకు సంబంధించి 24 అంశాలపై సమీక్షించాలని కలెక్టర్ భావించారు. కానీ వస్తున్న గ్రీవెన్స్ మీద రెవెన్యూ అధికారుల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల కేవలం 8 అంశాలపైనే చర్చించారు. ఒకదశలో అందరినీ సస్పెండ్ చేస్తే మార్పు వస్తుందని, పనులు సక్రమంగా సాగుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసర్వే జరిగిన గ్రామాల పరిధిలో అక్టోబర్‌లో రైతుల నుంచి తీసుకున్న గ్రీవెన్స్‌తో పాటు, డిసెంబర్ 6 నుంచి ఈ నెల 5 వరకు చేపట్టిన గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు ఆన్‌లైన్ చేయకపోవడంతో పాటు వాటికి పరిష్కారం చూపించడంలో మండల సర్వేయర్లు, వీఆర్వోల నిర్లక్ష్యంపై ఆగ్రహించారు. రెవెన్యూ సమీక్షలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి డివిజన్ స్థాయిలో నిర్వహించడం రివాజు. అయితే గత కొన్నేళ్లుగా రెవెన్యూ సమీక్షలు జరగడం అరుదుగా మారిపోయింది. అందుకే కలెక్టర్ సమీక్షిస్తామన్నా ఆ సమావేశానికి సంబంధిత అధికారులు సకాలంలో హాజరుకాలేదు. వాస్తవానికి అజెండా ప్రకారం సమీక్షలో చర్చించాల్సిన అంశాలపై అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశిస్తారు. అలా ఆదేశించినా ఎవరూ పెద్దగా లెక్క చేయకుండా సకాలంలో సమీక్షకు హాజరుకాలేదు. కొందరు అధికారులు రెవెన్యూ సమీక్షకు పూర్తిస్థాయిలో సమాచారం తీసుకురాకుండా హాజరు కావడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. దీంతో రెవెన్యూ అధికారుల తీరుపై కలెక్టర్ మండిపడ్డారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకుంఠ ఏకాదశి మహాపర్వదినం. ఈరోజు వైకుంఠంలో ముక్కోటి దేవతలు శ్రీమన్నారాయణుని దర్శించి సేవించుకుంటారని ప్రతీతి. కనుక ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. స్థానిక రెల్లవీధి రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు మావుడూరు రాఘవ శర్మ ఘనంగా పూజలు నిర్వహించారు. 90 ఏళ్ల చరిత్ర గల ఈ రామాలయంలో ఉత్తర ద్వార దర్శనంలో మొదటిగా శ్రీ మహావిష్ణువును దర్శించి, తర్వాత శ్రీ సీతారామ లక్ష్మణులను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటల నుంచి భజన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుంగ గంగాధర్, అలిగి దినేష్, రెల్ల మోహనరావు, అలిగి సత్యనారాయణ, రెల్ల జగన్నాథం, పొట్నూరు వెంకటరమణ, సలహా సభ్యులు పొట్నూరు వెంకటరత్నం, రెల్ల గోపి, బుర్రి మధు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకనకదుర్గకు అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాజమహేంద్రవరానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న తాళ్లపూడి క్షేత్రంలో గల శ్రీ నవదుర్గాది పరివార సహిత కనకదుర్గాదేవి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా జయహో శ్రీ జగజ్జనని అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సు కోరుతూ అమ్మవారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయాలని ఆలయ ప్రధానార్చకులు శివప్రసాదశర్మకు అందజేశారు. ఈ పుస్తకంలో నవదుర్గలు, సప్తమాతృకలు, దశమహా విద్యలకు చెందిన 108 సుప్రసిద్ధ ఆలయాల విశేషాలను, వాటి చరిత్రలను, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గొల్లపూడి వీరవేంకట నాగేంద్రకుమార్, శ్రావణి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అసిరితల్లి అమ్మవారికి ముర్రాటలు

## భారీగా తరలి వచ్చిన భక్తులు । అట్టహాసంగా తిరువీధి ఉత్సవం

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తమ్మినాయుడు పేటలో నాగావళి నదీతీరాన వెలసియున్న అమ్మా సంస్థాన్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అసిరితల్లి అమ్మవారికి భక్తులు శుక్రవారం ముర్రాటలు సమర్పించారు. మంగళవాయిద్యాలతో తిరువీధిని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సాగి శ్రీనివాసరాజు వర్మ దంపతులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్ శర్మ, సహాయ అర్చకులు నవీన్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధర్మకర్త శ్రీనివాసరాజు వర్మ అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన తిరువీధి 10 గంటల వరకు కొనసాగింది. గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు తులసి పత్రితో పూజలు నిర్వహించనున్నారు.











# త్వరలో గ్రంథాలయ పునర్వికాస ఉద్యమం



- అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు నల్లి ధర్మారావు
- ఉద్యమ కమిటీ ఏర్పాటు
- ఫిబ్రవరిలో విజయవాడలో తొలి మహాసభ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వాల ఉదాశీనత ఫలితంగా, జవసత్వాలు కోల్పోయిన రాష్ట్ర గ్రంథాలయ వ్యవస్థ పునర్వికాసానికి త్వరలో ఒక ఉద్యమం ప్రారంభించాలని విజయవాడలో జరిగిన సదస్సు తీర్మానించినట్టు అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు తెలిపారు. విజయవాడ 35వ పుస్తక మహోత్సవంలో భాగంగా గురువారం పునర్వికాస సరస్సు జరిగినట్టు, కవులు, రచయితలు, ప్రముఖ ప్రచురణ సంస్థల ప్రతినిధులు హాజరైనట్టు ఆయన చెప్పారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సదస్సు తీర్మానాలను వివరించారు. ప్రధాన వక్తగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కూటమి ప్రభుత్వంలో తాను ఉన్నా, గ్రంథాలయ వ్యవస్థ పట్ల ప్రభుత్వాలు చూపిస్తున్న నిర్లక్ష్యమే దుస్థితికి కారణమని ఆవేదనాపూరితంగా విమర్శించినట్టు ధర్మారావు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని కోరుతూ సదస్సు తీర్మానం ఆమోదించింది. గ్రంథాలయ సెస్ ద్వారా స్థానిక సంస్థల నుంచి వస్తున్న ఆదాయం, గ్రంథాలయాల నిర్వహణ, అభివృద్ధికి కేటాయించాలని మరో తీర్మానం కూడా ఆమోదించినట్టు ధర్మారావు చెప్పారు. ఒకప్పుడు రచయితల పుస్తకాలను గ్రంథాలయ సంస్థలు అచ్చు వేసే స్థితిలో ఉండేవని, ఇప్పుడు వాటి నిర్వహణకే ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారని, గ్రంథాలయ సెస్ పేరుతో వస్తున్న కోట్ల రూపాయలను ప్రభుత్వాలు దారి మళ్లించడమే ఈ దుస్థితికి కారణమని వక్తలంతా అభిప్రాయపడ్డారని తెలిపారు. సంప్రదాయ ప్రచురణ రంగానికి రచయితల మీద పట్టు సడలిపోయిందని, ఫలితంగా రచయితల్లో ఐక్యత కొరవడిందని సదస్సు అభిప్రాయపడింది. పునర్వికాస ఉద్యమ కమిటీకి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్‌ను కన్వీనర్‌గా సదస్సు ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అన్ని జిల్లాల్లో ఉద్యమ కమిటీలను ఏర్పాటు చేసేందుకు, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ నాయకులు పర్యటించి, జిల్లాల వారి సమస్యలను నిర్వహించి, జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. ఫిబ్రవరిలో విజయవాడలోని మాకినేని భవన్‌లో ఉద్యమ తొలి మహాసభ జరపాలని, పూర్తిస్థాయి ఉద్యమ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించింది.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.